నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 13 జూలై 2024 | KARIMNAGAR



# అమ్మ తపన

ఒకవైపు తన విధులు నిర్వర్తిస్తూనే స్కూల్ నుంచి వచ్చిన కొడుకును చదివిస్తూ తన అమ్మతనాన్ని చాటి చెబుతున్నది గంగాధరకు చెందిన మౌనిక. కరీంనగర్ రేకుర్తిలోని ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్న ఆమె శుక్రవారం పాఠశాల నుంచి వచ్చిన తన కొడుకును అక్కడే కూర్చోబెట్టుకుని హోంవర్క్ చేయించింది. ఒకవైపు వాహనదారులకు పెట్రోల్, డీజిల్ పోస్తూనే మరోవైపు కొడుకుకు పాఠ్యాంశాల్లో డౌట్స్ క్లియర్ చేసింది.

– కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 12 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థిలోకం నినదించింది. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి కలెక్టరేట్‌ల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని ధ్వజమెత్తారు. విద్యారంగ అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం, అద్దె భవనాల్లోనే సంక్షేమ వసతి గృహాలు కొనసాగుతుండడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేసున్నదని విమర్శించారు. విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప ట్రెజరీల నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదన్నారు. ఫీజులు రాలేదంటూ ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని వాపోయారు. దీంతో విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తల్లిదండ్రులు వడ్డీలకు అప్పులు తెచ్చి సర్టిఫికెట్లు తీసుకునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్‌లను తోసుకుని విద్యార్థులు కలెక్టరేట్ లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ధర్నాల అనంతరం ఆయా జిల్లాల కలెక్టరేట్లలో కలెక్టర్లు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కరీంనగర్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, విద్యార్థి నాయకులు అరవింద్, రాజు, రాము, వెంకటేశ్, విక్రంకుమార్, రజని, వినీత, వెన్నెల పాల్గొన్నారు.

# న్యాయం కోసం డీజీపీ ఆఫీసుకు

- గోడు వెల్లబోసుకున్న చొప్పదండికి చెందిన బాధిత కుటుంబసభ్యులు
- స్థానికంగా న్యాయం జరగడం లేదని ఆవేదన



హైదరాబాద్‌లోని డీజీపీ ఆఫీసు వద్ద చొప్పదండికి చెందిన విను కుటుంబసభ్యులు

చొప్పదండి, జూలై 12 : రాష్ట్రంలోని పలువురు బాధితులు ఏకంగా హైదరాబాద్‌లోని పోలీస్ కేంద్ర కార్యాలయానికి క్యూ కడుతున్నారు. స్థానికంగా తమకు న్యాయం జరగడం లేదని ఆరోపిస్తూ డీజీపీకి గోడు వెల్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా చొప్పదండి చెందిన ఓ బాధిత కుటుంబసభ్యులు డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. వారి కథనం ప్రకారం.. చొప్పదండికి చెందిన యువకుడు మంద విను జనవరి 21న అనుమానాస్పదంగా మృతిచెందాడు. అయితే, పాతకక్షలతో అతని స్నేహితులే మేడారం జాతరకు తీసుకుపోయి చంపేశారని తల్లిదండ్రులు మంద మహేశ్, నీరజ ఆరోపించారు. అయితే అక్కడి పోలీసులు డబ్బులు తీసుకొని నిందితులవైపు మాట్లాడుతున్నారని ఆరోపిస్తూ డీజీపీ ఆఫీసులో కన్నీటి పర్యంతమయ్యారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండ ఉన్నదని, అందుకే తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ఫోన్ మెమొరీ కార్డులు, డేటా డిలీట్ చేసి రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని, ఈ కేసును కొట్టి వేసేలా చేస్తున్నారని ఆరోపించారు. తమకు డీజీపీ న్యాయం చేయాలని వేడుకున్నారు. కాగా, డీజీపీ పేషీలో బాధితుల ఫిర్యాదు తీసుకుని మల్టీజోన్–1 ఐజీకి పంపుతున్నట్టు రిసిప్ట్ ఇచ్చినట్టు బాధితులు తెలిపారు.

# ఇద్దరు పిల్లలకు ఒక్కడే టీచర్



చిన్నరాత్‌పల్లి పాఠశాలలో విద్యార్థికి బోధిస్తున్న సీఆర్‌పీ కుమారస్వామి

కాల్వశ్రీరాంపూర్, జూలై 12: చిన్నరాత్‌పల్లి బడి మూతబడే స్థితికి చేరింది. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన స్కూల్, ఇపుడు కళ తప్పింది. పిల్లలు లేక బోసిబోతున్నది. గ్రామం నుంచి దాదాపు 50 మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తుండగా, ఈ స్కూల్లో రాజేశ్ 4వ తరగతి, శివరాం 5వ తరగతి ఇద్దరు మాత్రమే చదువుతున్నారు. వీరికి ఒక టీచర్ యాదగిరి ఉండగా, ఆయన శుక్రవారం లీవ్ పెట్టేశారు. దీంతో క్లస్టర్ సీఆర్‌పీ కుమారస్వామి విధులు నిర్వహించారు. పాఠాలు బోధించారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకనే తమ పిల్లల్ని ప్రైవేట్‌కు పంపిస్తున్నామంటూ తల్లిదండ్రులు పేర్కొంటుండగా, మండల కేంద్రానికి కూతపేటు దూరంలో ఉన్న పాఠశాలనే ఇలా ఉంటే గ్రామాల్లో ఉన్న స్కూళ్ల దుస్థితి ఎలా ఉంటుందో అర్థమైపోతున్నది. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలను బతికించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# భ్రూణహత్యలపై సర్కారు సీరియస్

రాష్ట్రంలోనే సంచలనం రేపిన 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు



- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ
- హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్ హోం సీజ్.. రిజిస్ట్రేషన్ రద్దు
- మరింత లోతుగా దృష్టి సారిస్తేనే దందాకు బ్రేక్



మాధవి నర్సింగ్ హోంను సీజ్ చేసిన అనంతరం ఉత్తర్వులను అందిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

**హుజూరాబాద్, జమ్మికుంట కేంద్రంగా సాగుతున్న భ్రూణహత్యలపై నాలుగు రోజులుగా 'నమస్తే తెలంగాణ' కథనాలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆరు రాష్ట్రాలకు విస్తరించిన ఈ రాకెట్‌ను వెలుగులోకి తెచ్చి, అబార్షన్లు జరుగుతున్న తీరుపై ప్రచురించిన కథనాలు కలకలం రేపుతున్నాయి. ఇవి రాష్ట్రంలోనే సంచలనం కాగా.. ఏకంగా ప్రభుత్వమే సీరియస్ అయింది. దీంతో జిల్లా వైద్య యంత్రాంగం రంగంలోకి దిగి, అబార్షన్లు చేస్తున్న మాధవి నర్సింగ్ హోంను సీజ్ చేసింది. అయితే ఇంతటితో ఆగిపోకుండా మరింత లోతుగా వెళ్తేనే ఒక నెట్‌వర్క్‌లా సాగుతున్న దందాకు బ్రేక్ పడే అవకాశముంటుంది.**

కరీంనగర్, జూలై 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అబార్షన్లపై 'నమస్తే తెలంగాణ' నాలుగు రోజులుగా వరుస కథనాలను ప్రచురించిన విషయం తెలిసిందే. హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్ హోమ్‌లో అబార్షన్లు జరగడాన్ని వెలుగులోకి తేవడంతో హుస్నాబాద్ పోలీసులు స్పందించి ఇప్పటికే దవాఖాన నిర్వాహకులతోపాటు నర్సులు, ఆపరేషన్ థియేటర్ ఆపరేటర్‌ను అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్యశాఖ చోద్యం చూస్తున్నదని, లోతైన విచారణ జరిపి చర్యలు తీసుకుంటేనే అడ్డుకట్ట పడుతుందన్న విషయాన్ని స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ కథనాలు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తుండగా, ప్రభుత్వం సీరియస్ అయింది. ఆ మేరకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు రంగంలోకి దిగారు. శుక్రవారం రాత్రి హుజూరాబాద్‌లోని శ్రీ మాధవి దవాఖానను తనిఖీ చేసి, సీజ్ చేయడంతోపాటు నర్సింగ్ రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేశారు. ఆ మేరకు సంబంధిత ఉత్తర్వులను యాజమాన్యానికి డీఎంహెచ్‌వో సుజాత అందించారు.

## నర్సింగ్ హోమ్‌లో అన్నీ లోపాలే..

డీఎంఅండ్‌హెచ్‌వో సుజాత ఆధ్వర్యంలో ఎంసీహెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సనా జువేరియా, హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో బీ చందు పోలీసుల సహాయంతో హుజూరాబాద్‌లోని శ్రీ మాధవి నర్సింగ్ హోంను తనిఖీ చేశారు. దవాఖాన రికార్డులను తనిఖీ చేసి, అన్ని లోపాలే ఉన్నట్టు గుర్తించారు. స్కానింగ్ రూం, ల్యాబ్, బెడ్స్, ఇతర గదులను పరిశీలించి, నిబంధనల ప్రకారం లేవని స్పష్టం చేశారు. దవాఖాన ముందు ప్రదర్శించిన డాక్టర్ల పేర్లు, ఇక్కడకు వచ్చే డాక్టర్ల పేర్లకు సరిపోవడం లేదని, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసిన డాక్టర్లకు బదులుగా వేరే వారు వస్తున్నారని చెప్పారు. బాత్రూంలు, రోగులు ఉండే గదులు, ఇతర గదులు సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహించారు. దవాఖాన నిర్వహణ సక్రమంగా లేకపోవడమే కాకుండా, రికార్డులు కూడా పూర్తి చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నర్సింగ్ హోమ్‌లోనే అబార్షన్ చేసినట్టు గుర్తించి చర్యలు తీసుకున్నారు.

## లోతుగా వెళ్తేనే అడ్డుకట్ట

హుజూరాబాద్, జమ్మికుంట కేంద్రంగా సాగిన ఈ అబార్షన్ల రాకెట్ ఆరు రాష్ట్రాలకు విస్తరించినట్టు తెలుస్తున్నది. అయితే, వైద్యారోగ్యశాఖ మరింత లోతుగా వెళ్తేనే ఈ దందాకు అడ్డుకట్ట పడే అవకాశముంటుంది. ప్రధానంగా హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా డాక్టర్లే భ్రూణహత్యల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' శుక్రవారం ప్రచురించిన కథనంలో వెల్లడించింది. ఒక నెట్‌వర్క్‌లా సాగుతున్న ఈ రాకెట్‌కు అడ్డకట్ట వేయాలంటే కేవలం హుజూరాబాద్ దవాఖానను సీజ్ చేసి వదిలిపెడితే ఏ మాత్రం ప్రయోజనం ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వైద్యాధికారి ఒక ప్రత్యేక బృందాన్ని నియమించి, లోతుగా విచారణ చేయిస్తేనే భ్రూణహత్యలు పూర్తిగా ఆగే అవకాశాలున్నాయి. ఈ వ్యవహారాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులు, వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ దందాకు బ్రేక్ పడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- డీఎంఅండ్‌హెచ్‌వో సుజాత

హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లోని దవాఖానల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయని డీఎంఅండ్‌హెచ్‌వో సుజాత హెచ్చరించారు. జిల్లా, హుజూరాబాద్ డివిజన్‌లో దవాఖానల తనిఖీల కోసం ప్రత్యేక బృందాలు పని చేస్తాయని తెలిపారు. హుజూరాబాద్‌లోని దవాఖానను సీజ్ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. డీఆర్‌ఏ చట్టం ప్రకారం దవాఖానలు నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ ప్రైవేట్ దవాఖానలు నడుపుతున్నట్టు తమ దృష్టికి వస్తే సీజ్ చేయడానికైనా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. అబార్షన్ల వ్యవహారంలో ముగ్గురు రిమాండ్‌కు వెళ్లారని, వైద్యురాలు ఎవరనేది? విచారణ జరుగుతుందని తెలిపారు. విచారణ అనంతరం సదరు డాక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎంఅండ్‌హెచ్‌వో చెప్పారు.



లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు, అర్చకులు

# 35 రోజులు.. ₹65.39 లక్షలు

ఇది కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం

మల్యాల, జూలై 12 : కొండగట్టు అంజన్న సన్నిధిలోని ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలలోని 12 హుండీలను శుక్రవారం విప్పి లెక్కించారు. 35 రోజులకు గాను ₹65,39, 167 ఆదాయం, 030 గ్రాముల మిశ్రమ బంగారం, 1 కిలో 850 గ్రాముల మిశ్రమ వెండి, 38 నోట్లు విదేశీ కరెన్సీ సమకూరినట్టు దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జి ఈవో ఆకునూరి చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీ లెక్కింపు పరిశీలకురాలు కవిత, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీరాజం, సంపత్, సిబ్బంది, శ్రీ లలితా సేవాట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ 'ఫార్మర్ల' సమస్య పట్టదా..?

తరచూ కాలిపోతున్నా పరిష్కారమేది

- నీళ్లు లేక ఎండిపోతున్న పంటలు, నారుమడులు
- అవస్థలు పడుతున్న అన్నదాతలు
- 20 రోజులైనా పట్టించుకోవడం లేదని ఆగ్రహం

**అసలే వర్షాభావం.. ఆపై కరెంటు కోతలు.. ఈ రెండు సమస్యలను అధిగమించుకుంటూ పంటలను ఎలాగోలా దక్కించుకుంటూ సతమతమవుతున్న రైతన్నకు ఇప్పుడు తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడం పుండుమీద కారంచల్లినట్టుగా మారింది. వరినార్లను కాపాడుకోవడానికి ఇప్పటికే నానా తంటాలు పడుతుండగా, విద్యుత్ శాఖ అధికారుల తీరు వారిని మరిన్ని కష్టాల్లోకి నెడుతున్నది. గంగాధర మండలంలోని వివిధ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి 20 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పదేళ్లలో ఎట్ల నడిచినయని, ఇప్పుడెట్ల కాలిపోతున్నాయని ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నాసిరకంగా మరమ్మతులు చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్లు వెంట వెంటనే కాలిపోతున్నాయని, వారికి పైసలు కావాలె తప్ప రైతుల గోస పట్టదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**


## కరెంటు ఆఫీసు సుట్టూ తిరుగుడైతంది



ఈసారి వానల జాడలేదు. ఇప్పటికే ఎవుసం ఆల్చెమైది. బాయిల ఉన్న నీళ్లతోనన్న నార్లు పోద్దామని చూస్తె మా పొలం దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫారం 20 రోజుల కింద కాలిపోయింది. అప్పటి నుంచి కరెంటు ఆఫీసు సుట్టే తిరుగుడైతంది. కరెంటు లేకపోవుడుతోని నార్లు కూడా పొయ్యలేదు. ఎప్పుడూ గిన్ని రోజులు కాలే. ఏంజెయ్యాల్నో సమజైతలేదు. ఏటా నాకున్న మూడెకురాల్ల వరి ఏసెటోన్ని.. ఈసారి ఇప్పటికి మూడు గుంటలు కూడా ఎయ్యలేదు. సార్లు జల్ది ట్రాన్స్‌ఫారం రిపేర్ చేయించాలె.

- ఎగర్ల కుంటయ్య, రైతు (నాగిరెడ్డిపూర్)

## ఇరువై రోజులల్ల ఐదు సార్లు కాలిపోయింది



మా పొలం దగ్గర ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 20 రోజులు అయితున్నా సార్లు పట్టించుకుంటలేరు. వరి నార్లు ముదిరిపోతున్నయి. కాంట్రాక్టర్ తక్కువ రకం వైరు, వస్తువులు వాడుడుతోనే 20 రోజులల్ల మా దగ్గరి ట్రాన్స్‌ఫార్మర్ ఐదు సార్లు కాలిపోయింది. ఇట్ల తెచ్చిపెడుతరో లేదో అట్ల కాలిపోతున్నది. ఇన్నేండ్ల సుంది ఎట్ల నడిసినయి, రెండు నెల్లసంది జెప్పుజెప్పున ఎట్ల కాలిపోతున్నయో సార్లు చెప్పాలె. తక్కువ రకం సామన్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్ తొందరగా కాలిపోవా..? తిప్పలవెడితే రైతులు మళ్లీ తీసుకువస్తరు. మళ్లీ రిపేర్ చేస్తే పని దొరుకుతది.. పైసలు అత్తయని కాంట్రాక్టర్ ఇక మాత్ పడుతున్నడు. రానుపోను ఖర్చులు, ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కిచ్చుడు, దించుడు ఖర్చులతోని మేం ఇబ్బంది పడుతున్నం. వీళ్లకు రైతుల గోస పట్టదు. పైసలు మాత్రం కావాలె.

- గొర్రె దేవయ్య, రైతు (వెంకంపల్లి)



సబ్ స్టేషన్‌కు రిపేర్ కోసం తీసుకువచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

గంగాధర, జూలై 12 : గంగాధర మండలంలోని నాగిరెడ్డిపూర్, న్యాలకొండపల్లి, వెంకంపల్లి గ్రామాల్లో 20 రోజుల క్రితం నాలుగు 16కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంకపల్లిలో ఇప్పటికే వరి నార్లు ముదిరిపోగా, పోసిన నారుమడులు కూడా ఎండిపోతున్నాయి. సమస్య ఇలాగే ఉంటే తీవ్ర నష్టం వచ్చే ప్రమాదమున్నది. నాగిరెడ్డిపూర్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేర్ చేయకపోవడంతో నార్లు కూడా పోయలేని దుస్థితి ఉన్నది. న్యాలకొండన్నపల్లి పరిధిలో పంటలకు నీరందక ఇబ్బంది పడుతున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే అవి తరచూ కాలిపోతున్నాయని రైతులు మండిపడుతున్నారు. నెల రోజుల క్రితం బూరుగుపల్లిలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేసి బిగిస్తే ఇప్పటికే మూడు సార్లు, వెంకంపల్లిలో 20 రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ ఐదు సార్లు కాలిపోయిందని చెబుతున్నారు. తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడంతో రవాణా, ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం, కాంట్రాక్టర్ నాసిరకం పనులతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.



వెంకంపల్లి వద్ద కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

## 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేవు

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులు ఇబ్బంది పడకుండా వెంటవెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. మూడు గ్రామాల్లో కాలిపోయినవి 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లే. ప్రస్తుతం 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేవు. దీంతో కొద్దిగా ఇబ్బంది అవుతున్నది. పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

- సత్యనారాయణ, ఏడీ



విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో కూర్చున్న రైతులు



సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

# కదంతొక్కిన బీడీ కార్మికులు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కన్నెర్ర
- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా
- చేయూత పథకం కింద ఇస్తానన్న ₹4వేలు ఇవ్వాలని డిమాండ్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 12: బీడీ కార్మికులు కదం తొక్కారు. చేయూత పథకం కింద ప్రతి నెలా ₹4వేలు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ సర్కారుపై కన్నెర్రజేశారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శుక్రవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల రాములు మాట్లాడుతూ, కుటీర పరిశ్రమగా అభివృద్ధి చెందిన బీడీ పరిశ్రమ లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి చూపుతున్నదని చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు, జీఎస్టీ, అనేక ఆంక్షలను విధింపుతో పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదన్నారు. చేతినిండా పని లేక, సరైన వేతనాలు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ₹4వేలు ఇస్తామన్న హామీ ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. చేయూత పథకాన్ని వెంటనే వర్తింపజేయాలని, బీడీ కార్మికులతోపాటు ప్యాకర్స్, ఛాటర్స్, నెలసరి ఉద్యోగులకూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని, విరమణ పొందిన వారికి కనీసం ₹10 వేలు పెన్షన్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు చెప్పారు. ఇక్కడ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ భూమేశ్వర్, గౌరవాధ్యక్షుడు భూమన్న, ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ సూర్యశివాజీ, జిల్లా అధ్యక్షురాలు మందడి మణెవ్వ, జిల్లా కార్యదర్శి వేముల పర్శరాములు, సిద్దిపేట జిల్లా నాయకుడు తడక లచ్చయ్య, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు రవితేజ, కొయ్య రాకేశ్, సోను, అశోక్, పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.

# వాగేశ్వరికి అటానమస్ హోదా



మాట్లాడుతున్న కళాశాల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

తిమ్మాపూర్, జూలై12 : రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలకు యూజీసీ అటానమస్ హోదా ప్రకటించినట్టు ఆ కళాశాల కార్యదర్శి గంగ్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ హోదా వల్ల పరిశ్రమలు, విద్యారంగం, కోర్సుల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సెలబస్‌ను మార్చుకుంటూ విద్యార్థులకు నూతన అంశాలను బోధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ హోదా పదేండ్ల పాటు అమలులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.